# సిక్త్స్ సెన్స్

"ఈ చోద్యం విన్నారా? పాకిస్తానులో వేదాల్లేవుట!"

"సిట్టెమ్మ చిన్నకూతురు సూనినావా గురూ? ఎంతై పోనాదో? ఈపుమీద యిస్త్రీ పెట్టెయ్యొచ్చు."

"ఇట్స్ ప్లెజర్ మీటింగ్యూ"

"కాస్త చంటాణ్ని అందుకో తల్లీ"

"పొట్టివాడైనా గట్టివాడు మన లాల్ బహదూరు."

ఈ థర్డుక్లాస్ గొడవేమీ ఫస్ట్‌క్లాస్ దగ్గర నిలబడ్డ ఎ. ఎస్.పి. రాజేశ్వర్రావుకి వినిపించలేదు. అతనసలు ఫస్టుక్లాసు గొడవగాని, థర్డుక్లాస్ గొడవగాని విపిపించుకొనే స్థితిలో లేడు. తనే ఫస్టు క్లాసుకి మించిన ఒక పెద్ద ఎయిర్ కండిషన్డ్ గొడవలో పడి పోయేడు.

ఎయిర్ కండిషనులో వున్నట్టే వళ్ళంతా చల్లబడి పోతూంది, మూడు గంటల ఎండ పన్నెండుగంటల దాన్లా పేలిపోతున్నా, తల్లో మాత్రం బ్లెస్ట్ ఫర్నేస్ వున్న ట్టుంది. అతనావూరులోవున్న నాల్నెల్లలోనూ, మూణ్నెల్ల ఇరవైతొంది రోజులు డాక్టర్ రాధ చుట్టూ పెంచిన ప్రేమలతను ఆమెకు చూపకుండానే దాని గురించి చెప్పకుండానే వెళిపోతున్నాడు. అలా వెళ్లిపోవల్సి వచ్చింది. "మూణ్నెల్ల యిరవైతొంది రోజుల్లోనూ ఎవరూ యింకెవర్నీ ఒక జీవితకాలంలో ప్రేమించలేనంత ప్రేమించేను రాధా" అని ఆమెతో చెప్పాలనీ, ఇంకేమేమో చెయ్యాలనీ అతనికి ఎంతగానో వుంది. కాని చుట్టూ ఎంతోమంది యూనిఫారాల్లో వున్న సబార్డి నేట్సున్నారు. ప్రపంచమంతా తోలు జోళ్ళతోనూ, తోలు పటకాల తోనూ, సబార్డినేట్సుతోలు మొహాల్తోనూ చేసినట్టుండి తోలుకంపు కొడ్తోంది.

రాజేశ్వర్రావు ఆ వూరొచ్చి సరిగ్గా నాల్నెల్లైంది. వచ్చిన మర్నాడే పెళ్ళికాని డాక్టర్రాధని చూసేడు. మర్నాటి వరకూ ఆగకుండా చూసినప్పుడు "ఈమెను పెళ్ళాడేవాడు ధన్యుడు" అన్న నిశ్చయానికి వచ్చేడు. మర్నాడు మాత్రం ఆధన్యత తనకే ఎందుకు చిక్కకూడదని తర్కించుకున్నాడు. నెల తిరక్కుండా తనకు చెందాలని నిశ్చయించుకున్నాడు రెణ్ణెల్లకే తన రైవల్ నూటర్ డాక్టర్రాజుమీద ప్రొహిబిషను కేసు పెడదామా, పేకాట కేసు పెడదామా అని ఆలోచించేడు. అతని ఆలోచన తేలేలోగానే డాక్టర్రాజు ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోయ్యేడు. అప్పుడు గవర్నమెంటు ద్యోగులకు ట్రాన్స్‌ఫరుండడం మంచిదనుకున్న రాజేశ్వర్రావు తనకి ట్రాన్స్‌ఫర్రాగానే తన అభిప్రాయం మార్చుకున్నాడు.

రాజేశ్వర్రావుకి తన డిపార్టుమెంటు ఓవర్‌హాల్ చెయ్యాలనీ, చెయ్యవలసిన అవసరం యెంతేనా వుందని ఎప్పుడూ అని పిస్తుంది. శక్తివంచనలేకుండా ప్రయత్నిస్తాడుకుడా. "ఫర్వాలేదు. కష్టపడి పనిచేస్తే ముందుకొస్తాడు" అన్నాడు తనయినా పొగుడు కోలేని ఎస్పీ రాజేశ్వర్రావు గురించి.

ఈ వూరొచ్చిన కొద్దిరోజులకే మంచిపేరు అలవాటు ప్రకారం తెచ్చుకున్నాడు రాజేశ్వర్రావు. అతనొచ్చేక సైకిల్ చోరీలు తగ్గిపోయేయి. వ్యభిచారం గూఢంగానే సాగేది. అతను "రౌడీల్లో రౌడీ, తగు మనుషుల్లో తగు మనిషి" అని హర్షించేరు ప్రజలు. అతని సబార్డినేట్సుకి మాత్రం అతన్లో తగు మనిషి చిహ్నాలు తక్కువగానే కనిపించేయి.

"మన డిపార్టుమెంటుకి పరువూ మర్యాదా లేకుండా పోయేయి. దానిక్కారణం సహం చరిత్రా, సహం మన మూను.

ఏ రాష్ట్రంలో ఎవరికి యే భాష వద్దన్నా, ఏ టౌన్లో బియ్యం తక్కువైనా, ఏ పల్లెలో కిరసనాయలు సమంగా కాలకపోయినా ముందు తన్నుల్తినేది మనం. దీనిక్కారణం పూర్వం మనవాళ్ళు తెల్ల యముళ్ళభటుల్లా ప్రవర్తించడమే.

ఇకపోతే మనం ప్రస్తుతం చేసే పన్లుకూడా యేమంత బావుం డలేదు. మనలోనే కొంతమంది ఎక్కువమంది కాక పోవచ్చు- పాకెట్లు కొట్టేవారికి పెర్మిట్లిస్తున్నారు. సారావండే వాళ్ళకీ, అమ్మేవాళ్ళకీ లైసెన్సు లిస్తున్నారు. ఈ చీడపురుగులు నశించాలి.

మన డిపార్టుమెంటుకి సరైన కీర్తి రావాలంటే సారా అమ్మిం చడం, దొంగతనాలు చేయించడం మానేసినంత మాత్రాన సరిపోదు. నేరాలు జరిగేక ముద్దాయిలను పట్టుకున్నంత మాత్రాన చాలదు.

అసలు నేరాలే జరక్కుండా చూడాలి. దీనికి దొంగని చూడ గానే గుర్తించే శక్తి మనకుండాలి. మనక్కావలసింది- ఒక విధ మైన సిక్త్స్ సెన్స్ నాకు తెలుగు సరిగ్గా రాదు. దాన్ని మీరు ఆరో యింద్రియమే అంటారో, ఆరోజ్ఞానమే అంటారో అనండి. కాని ఆ సెన్స్ మనందరికి వుండాలి. దాన్ని మనమంతా కల్టివేట్ చెయ్యాలి" అని రాజేశ్రావెప్పుడూ బాహాటంగానే అంటు వుంటాడు తన సబార్డినేట్సుతో.

తన సన్నిహిత స్నేహితుల్తో మాత్రం ప్రైవేటుగా నెల్లూరు లోనూ, అనంతపూరులోనూ తయారయే ఈ నాటు సరుక్కి ఎక్కణ్నించి వస్తుందీ సెన్స్? మౌంట్ ఆబూలో తర్ఫీదయ్యే మాకు అంటే ఐ.పి.యస్. వాళ్ళకి మాత్రం వద్దన్నా వస్తుంది" అంటాడు.

ఈ వూరిలో తన సబార్డి నేట్సుతో ఒకరిద్దరికే సెన్స్ వున్నట్ట నిపించిందతనికి. వాళ్ళచేత ఆ సెన్స్ కల్టివేట్ చేయించేలోగానే తనకు ట్రాన్స్‌ఫర్ ఆర్డరొచ్చింది.

సరిగ్గా మూడ్రోజులకింద "విజయవాడలో ఎవరో ఎవరిళ్ళో తగలబెట్టేస్తున్నారు. అక్కడికి వెళ్ళి ఏం చెయ్యాలో చెయ్, నిన్న క్కడికి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాం అంది ప్రభుత్వం అతన్తో. "ఫైరింజన్నై యిళ్ళు ఆర్పమంటారా? అశోక సామ్రాట్నునై కొత్తిళ్ళు కట్టించ మంటారా? నేనేం చేస్తాను" అని విసుక్కున్నా వెళ్ళక తప్పలేదతనికి.

ఈ మూడ్రోజుల్లోనూ తన ప్రేమ వ్యక్తం చేయడానికి రాజే శ్వర్రావుకి రెండు ఆటంకాలొచ్చేయి. రోజుకు మూడు పార్టీల చొప్పున ఈ మూడ్రోజులు పార్టీలు యిచ్చిన స్నేహితులు మొదటి ఆటంకం. రాత్రి తప్ప పగలు ప్రసవించమనే రాధ పేషెంట్లు రెండో ఆటంకం.

వెన్నెల్లాంటి మల్లెపూలు, మల్లెపూల్లాంటి వెన్నెలా లేక పోయినా, ఎస్పీ పెళ్ళాం కోపంలా మండిపోయే ఎండలో ఎలా వ్యక్తపరచడం తన ప్రేమ అని అంతవరకూ అనుకుంటూన్న అతను "ఎండైనా వానైనా ఇప్పుడు చెప్పేద్దును ఒక్కక్షణం ఏకాంతం వుంటే" అని అనుకుంటూ వుంటే రైలు కదలడం, గంట కొట్టడం, గంటలా ఖంగుమని "వెల్ సో జెండాలు ఊప డం, 12 జతల పోలీసు జోళ్ళ చప్పుళ్ళతో, పోలీసు సలాములు, రాజేశ్వర్రావు ఒక్కసారి రైల్లోకి దూకడం క్షణంలో జరిగి పోయేయి.

"ఒక్క క్షణం ఏకాంతం, ఒక్క ఏకాంత క్షణం" అనుకుంటూ రైల్లో ప్రవేశించిన అతనికి "ఈ రోజుల్లో ఫస్టు క్లాసులో కూడా ఏకాంతం లే" దనిపించింది. పేషెంటులా వాలిపోయిన ఒక తెల్లని ఏభై అయిదు సంవత్సరాల నాజూకైన ముసలాయన శాలువ కప్పుకుని ఒక బెర్తు మీద పడుకున్నాడు. ఆడవాళ్ళ కుండవలసిన సన్నని ఎత్తయిన ముక్కూ శాసించే మెరక కళ్ళు, సిగరెట్లు కాల్చినా నల్లపడని సొంపైన పెదాలతో కాలంలో వున్నప్పుడు చాలా కొంపలకి నిప్పెట్టి వుంటాడన్నట్టు వున్నాడు. అతని జుత్తులాగే, తెల్లబడ్డ రోజున్నర పెరిగిన తెల్లగడ్డం అతనికి అందమే తెచ్చిందని ఒప్పుకోక తప్పదు. పై బెర్తుమీద అతని జిప్ సూట్‌కేసూ హోల్డాలూ వగైరా సామాన్లున్నాయి. అతను ఫారిన్ మాగజైను చదువుకుంటున్నాడు.

రెండో బెర్తుమీద టైతోసహా టెర్లిన్ సూట్లోవున్న 30 ఏళ్ళ నల్లటివాడు పక్కనున్న జిప్‌బేగ్‌లోంచి అస్తమానూ నాలికతో పెదాలు తడుపుకుంటూ, లేని సున్నితం తెచ్చి పెట్టుకుంటూ కూర్చున్నాడు చేతిలో వున్న తెలుగుపత్రిక చదవకుండా. మనిషి చూస్తే టెర్లిన్‌చొక్కా తొడుక్కున్న పులిలా వున్నాడు. జీవితంలో పనంటే ఏవిఁటో ఎరగని వాడని అతన్ని చూడగానే అనిపిస్తుంది. రాజేశ్వర్రావు కతన్ని చూడగానే అలానే అన్పించి అసహ్యం వచ్చిందతని మీద. మేనకని చూసిన విశ్వామిత్రుడిలా ముస లాయన్ని చూడగానే రాజేశ్వర్రావు కభిమానం ముంచుకొచ్చింది. ఎంత చెప్పినా ఫారిన్ కల్చరుంది. అతన్లో "ఫారిన్ వెళ్ళే వుంటా" దనుకున్నాడు రాజేశ్వర్రావు.

రాజేశ్వర్రావుని చూడగానే ముసలాయన వేలకి విలువైన నవ్వు పారేసేడు. ఉరివేసేముందు జడ్జిగారి నవ్వులా లేదా నవ్వు. కన్నతల్లి చూపులా చల్లగానూ, వెన్నెలచాటు ప్రియురాలి పలక రింపులా వెచ్చగాను వుంది. (మేనక కూడా విశ్వామిత్రుడిమీద యిలాటిదే వదిలుండాలి) ముసలాయనే స్టేట్ ఎక్స్‌ప్రెస్ సిగరెట్టు ఆఫర్ చేస్తూ రాజేశ్వర్రావుతో మాటలు కలిపేడు. తనని తానే పరిచయం చేసుకున్నాడు. ఢిల్లీలో ఏదో పెద్ద మందులకంపెనీ అసిస్టెంట్ మేనేజరుట. నాల్నెల్లైకిడ్నీ ట్రుబుల్‌తో బాధపడు తున్నాట్ట. మరోమూణ్ణెల్లకి కాని ఆపరేషను చెయ్యమన్నారుట. ఆపరేషను చేయించుకునే లోగానే" మనవాళ్ళ"నందర్నీ చూద్దా మని ఈప్రాంతాలు వచ్చేట్ట. ఉదయం విశాఖపట్నంలో ఈ పాసింజెరులో (యీ ముష్టిరైల్లో) బైల్దేరి కాకినాడ వెళదామను కున్నాట్ట. కాని తోవలో తన బాధ లావైందిట. అంచేత నేరుగా విజయవాడ వెళ్ళిపోతున్నాట్ట. అక్కడ పెద్ద డాక్టరు– కిష్టయ్య– స్నేహితుడూ, క్లాస్‌మేటూనట. ప్రాక్టీసు చెయ్యకపోయినా తనూ డాక్టరేనట. అంచేత తన జబ్బు ఎంత ప్రమాదమైందో తనకి తెలుసుట. "ఏమిటో చిన్నప్పుడు నేనూ కమ్యూనిష్టునే. ఐనా జీవితంలో చాలా భాగం చూసేక మన చేతుల్లో ఏఁవీఁలేదని పిస్తుంది. రేపొచ్చేది మనకు తెలియదు. కాస్తో కూస్తో హోదా వుంది. రెండు కార్లున్నాయ్. కావలసినంత డబ్బుంది. లక్ష్మీ దేవిలాంటి యిల్లాలుంది. అందొచ్చిన పిల్లలున్నారు. ఎన్నుంటే

ఏం లాభం? దిక్కులేనిచావు విజయవాడలో చావమని నాకు రాసేడేమో. ఇదిచూసైనా భగవంతుణ్ని మనం నమ్మక తప్పదు. వాడి ఆజ్ఞేది మనం కాదనలేం" అని ముగించేడు ముసలాయన.

ముసలాయన వేదాంతం ముసలాయన్లాగే సింపుల్ గానూ, కన్విన్సింగ్‌గానూ కన్పించింది రాజేశ్వర్రావుకి అతని పరిస్థితికి చాలా బాధపడ్డాడు రాజేశ్వర్రావు.

ఆ తర్వాత ముసలాయన చాలా విషయాల గురించి చాలా చక్కగా మాట్లాడేడు. సాధన, సావిత్రిలలో యెవరు గొప్ప? కామరాజునాడార్కి, కైజర్కివున్న పోలికలేవిఁటి? వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో పవరులోకి రావడానికి కమ్యూనిష్టులకున్న ఛాన్సెస్ ఏఁవిఁటి? వాళ్ళు పరిపాలనకు వస్తే ఆ గండం తప్పించుకుందికి ప్రజలకున్న ఛాన్సెస్ ఏఁవిఁటి? అన్నీ తాను అలసి పోయినట్టు తెలీనివ్వకుండా నెమ్మదిగా వివరించేడు ముసలాయన. కాని అతను వినిపించనివ్వని మూలుగు రాజేశ్వర్రావుకి వినిపిస్తూనే వుంది. అర్ధరాజ్యం, కన్నకూతుర్నీ యివ్వడానికి రాజేశ్వర్రావు పాతకాలం రాజుకాదు. కాని ముసలాయనకి చేతనైతే సాయం చేయాలన్పించింది రాజేశ్వర్రావుకి. అతన్ని లేవనీయకుండా అతని ఫ్లాస్కులో కాఫీ కప్పులో పోసిచ్చేడు. అతనికి తగిలేట్టు ఫాన్ ఫిక్స్ చేసేడు. అతని సిగరెట్టుకి అగ్గిపుల్ల కొట్టేడు.

ఏదో స్టేషన్లో టెర్లిను పులిదిగిపోయేడు. అతను అంతవరకూ ఒక్కమాటైనా మాటాళ్ళేదు. అతను దిగిపోగానే అతని గురించి రాజేశ్వర్రావు "అతనేం చేస్తున్నాడంటారు" అనడిగేడు ముసలాయన్ని. ఏ పనీ వున్నవాళ్ళా లేడు"

"ఐతే నోట్లు అచ్చుకొట్టేవాడైనా ఐవుండాలి" అని శ్రుతి కలిపేడు ముసలాయన.

తర్వాత కొంతసేపటికి ముసలాయన బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు. ఓ నిమిషమయ్యేక బాత్‌రూమ్ తలుపు ఓరగా తెరచి తల బైటికి పెట్టి "దయచేసి ఆ బేగ్ కాస్త యిలా యిస్తారూ" అన్నాడు.

ఆ క్షణంలో అతన్ని యెత్తుకు పరిగెత్తమన్నా పరిగెత్తుతాడు రాజేశ్వర్రావు. ఆ కొద్దిసేపట్లోనే ముసలాయన మొహం వంకర్లు పోయింది. బలవంతాన ఎవరో గొంతు పిసికేస్తున్నట్లు గుడ్లు బాగా పైకి వచ్చేసేయి. వంట్లో వున్న రక్తమంతా మొహంలోకి దిగిపోయినట్టు, నల్లగావుందా అని అనుమానం వచ్చేట్టు ఎఱ్ఱబడిపోయిందతని మొహం. పులినోట పడ్డ పసిపిల్ల పిలుపులా దీనాతిదీనంగా వుందతనిమాట.

రాజేశ్వర్రావు చప్పున బేగ్ అందించేడు. అందుకుని ముసలాయన మళ్ళీ తలుపు వేసేసుకున్నాడు. తొలిరాత్రిభార్య రాకకోసం ఎదురుచూసే భర్తలా రాజేశ్వర్రావు ఆత్రంగా బాత్ రూము డోర్‌వేపు చూస్తూ కూర్చున్నాడు.

కొన్ని నిమిషాలయ్యేక తలుపు తెరుచుకొని తల్లిని తగలబెట్టినవాళ్ళా తడిపంచ బుజాన వేసుకొని ముసలాయన బైటకు వచ్చి నీరసంగా గోడకు చేరబడిపోయేడు. అతను మరో పంచ కట్టుకుని వున్నాడు. రాజేశ్వర్రావు సానుభూతితో నడిపించుకు తీసుకొస్తూవుంటే "గుడ్ గాడ్. రక్తం పడ్తోంది. ఇట్ హేజ్ స్టార్టెడ్ బ్లీడింగ్" అన్నాడు ముసలాయన.

ముసలాయన్ని బెర్తుమీద పడుకోబెట్టి నిండా శాలువ కప్పి "ఇంకెంతసేపు? ఇంకో రెండుగంటల్లో చేరిపోతాం, రెస్టు తీసుకోండి" అని సలహా యిచ్చి రెండో బెర్తుమీద బయటకు చూస్తూ కూర్చున్నాడు రాజేశ్వర్రావు.

బయటంతా దైవ సృష్టిలా వుంది.

ప్రకృతంతా ఆకుపచ్చ చీరకట్టిన గర్భవతిలా నిండుగా వుంది.

ఎన్నో పూదోటలతో సయ్యాటలాడిన చిరుగాలి ప్రియురాలి ముంగురులని ఊపినట్టు పచ్చటి చేలని వూపుతోంది.

నెత్తిన గంపల్తో వయ్యారంగా ఉల్లాసంగా కొత్త కోడళ్ళలా నడిచిపోతున్నారు. రంగురంగు చీరలు కట్టిన పల్లె పడుచులు.

తారతమ్యం లేకుండా అందరికీ అన్నిటికీ బంగారు పూతలు పూస్తున్న అస్తమించే సూర్యుడు.

వీటన్నిటికీ అపశ్రుతిలా ముసలాయన బాధతో మూలుగుతున్నాడు.

❖ ❖ ❖

రైలు విజయవాడ చేరేసరికి రాత్రి తొమ్మిద్దాటింది. ఊరు తగలబడిపోతున్నట్టు తగలబడిపోతోంది. ఆకాశమంతా నల్లమబ్బుల్లాంటి పొగల్తోటి, వాటి నల్లదనం సుస్పష్టంగా కనిపించడానికి కావలసినంత మంటల్తోటి నిండివుంది.

భూలోకంలోని పాపం దేవుళ్ళుండే స్వర్గాలను తగల బెట్టేస్తుందా అన్నంత ఎత్తుకి లేస్తున్నాయి మంటలు.

రాక్షసి కన్యలు కురులు ముళ్ళువేసుకుంటున్నట్టు సుళ్ళు తిరుగుతున్నాయి పొగలు.

వాడుకలో లేని శ్మశానంలా ఉంది ప్లాట్‌ఫారం. రైల్లోంచి దిగేవారి హడావిడేగాని, ప్లాట్‌ఫారంమీద మనుషుల్లేరు. రైలుని చూసి పరుగెత్తుకు వచ్చేరు. సి.ఐ., టూటౌన్ ఎస్.ఐ. ముగ్గురు పి.సీ.లు.

"క్షమించండి సార్! మెన్ అంతా ఊళ్ళో డ్యూటీలో వున్నారు" అంటూ రాజేశ్వర్రావుని రిసీవ్ చేసుకున్నాడు సి.ఐ. సామాను పీ.సీ.లు దింపుతూ వుంటే "క్షమించండి" అంటూ జారుకున్నాడు ఎస్.ఐ.

రాజేశ్వర్రావువీ, ముసలాయనవీ సామానులు చాలా మట్టుకు పి.సీ.లు పట్టుకున్నారు. సి.ఐ. కూడా రాజేశ్వర్రావు పెట్టె పట్టుకున్నాడు. ముసలాయన సూట్‌కేస్ రాజేశ్వర్రావు ఫర్వాలేదంటూ పట్టుకున్నాడు.

టాక్సీ స్టేండు చేరేసరికి ఒకటే టాక్సీ వుంది. "ఇద్దరం యిందులో ఎక్కేద్దాం" అని ముసలాయన్తో అని, "మీరు డ్యూటీ పాడుచేసుకోకండి. దారి చూపెట్టడానికి మాతో ఒక్క పి.సి. వస్తే చాలు" అని సి.ఐ.తో అని రాజేశ్వర్రావు వెనకసీట్లో ఎక్కేడు. అతని పక్కన ముసలాయనా, ముందు సీట్లో పి.సి. ఎక్కేక బైలుదేరింది.

దారిలో నీరసంతో వణికే కంఠంతో ముసలాయన రాజేశ్వ ర్రావుకి కృతజ్ఞతలు తెలియచేసేడు. ఆవేశంతో వణికే కంఠంతో కొంపలికి నిప్పుపెట్టే ఏంటీ సోషల్ ఫోర్సెసుని శపించేడు. ఎ.ఎస్పి. క్వార్టర్సు చేరేక రాజేశ్వర్రావుని దింపి అతన్ని టాక్సీబిల్లు యివ్వకుండా అతనికి మరోసారి థేంక్‌చేసి "ఎలా వున్నదీ రేపు కబురుచేస్తా. వీలైతే నేనే వస్తా" అంటూ టాక్సీలో వెళ్ళిపోయేడు ముసలాయన.

❖ ❖ ❖

ఊరికి రాజేశ్వర్రావు కొత్త. ఏ పని చేద్దామనుకున్నా వీలు కాకుండా వూళ్లో పై అధికారులూ, మినిష్టర్లూ కేంపు. వాళ్ళ మర్యాదలు చూసేసరికే పొద్దుపోతోంది. "ఇహ యిన్వెస్టిగేష నేఁవిఁటీ? నా మొహం!" అని విసుక్కుంటూనే మూడ్రోజులు గడిపేడు రాజేశ్వర్రావు.

నాలుగోనాడు ఉదయం మండుతున్న యిళ్ళు ఆరిపోయి నట్టుగా, తుఫానువెలిసినట్టుగా సంతుష్టినివ్వని ప్రశాంతతతో వుంది వూరు. ఆ ముందురాత్రి యిళ్ళేమీ తగులబళ్లేదు. ఆ ఉదయమే చీటికీ మాటికీ ఒళ్ళు మండించుకునే అధికార్లు వగైరాలు వెళ్ళిపోయేరు. వాళ్ళని సాగనంపి యింటికొచ్చి బద్ధకంగా పక్కమీద వాలిన రాజేశ్వర్రావుకి చెంపమీద కొరడాతో ఛెళ్ళున కొట్టినట్లయింది టెలిఫోను మొగగానే.

రిశీవరు ఎత్తితే టూ టౌన్ ఎస్.ఐ. మాట్లాడుతున్నాడు.

"గుడ్‌మార్నింగ్ సార్! (సలాంకొట్టిన జోళ్ళచప్పుడు) దొంగ నోట్ల అచ్చుకేసులో ముద్దాయి దొంగ నోట్లతో సహ దొరికి పోయేడు సార్. రిమేండుకు పంపేలోగా మీరు చూస్తానంటే బంగళాకి తీసుకొస్తానుసార్" అన్నాడు ఎస్.ఐ.'సర్లే తీసుకురా' అన్నాడు రాజేశ్వర్రావు. ఖూనీలు చేసినవాడ్నీ, నోట్లు అచ్చు కొట్టేవాడ్నీ, సినిమాలో వేసిన వాడ్నీ, ఎలక్షనులో గెల్చినవాడ్నీ చూద్దామనే సామాన్యుని కుతూహలంలో ఏమీ విడ్డూరం లేదు.

"కాని ఎంత విడ్డూరం" అనుకున్నాడు రాజేశ్వర్రావు, జల గలాసాగి సలాంకొట్టి టూటౌన్ ఎస్.ఐ. జీప్ సూట్‌కేస్తో సహా ముసలాయన్ని హాజరు పెట్టినప్పుడు.

కేసు వివరాలు తెలుసుకున్నాక "నీ ఆరోగ్యం ఎలా వుంది?" అని ముద్దాయి నడిగేడు రాజేశ్వర్రావు.

వీడికేం తక్కువసార్! ముసలి నక్కలా అలావున్నా, పులిలా నలుగురితో పెనుగులాడేడుసార్. మేంపట్టు కున్నాం" ఎస్.ఐ. జవాబు చెప్పేడు.

❖ ❖ ❖

"తవఁరొచ్చిన బండికే కౌంటర్ఫీట్ నోట్ల కేసులో ఒక డొస్తు న్నాడని ఖోగట్టా చేరింది సార్. వాడి వర్ణనకూడా ముందుగానే వచ్చిందిసార్. కాని మీరేం అనుకోకండి. పొరపాట్లెవరికైనా వస్తాయ్. వీడు మీతోటే వచ్చి మీ చేత నోట్లపెట్టె మోయిస్తాడని అనుకోలేదుసార్. తప్పంతా మాదే సార్. ఇంకెప్పుడూ యిలాంటి పొరపాట్లు రాకుండా చూసుకుంటాను" అని ప్రాధేయ పూర్వ కంగా రాజేశ్వర్రావుకి ఆ సాయంత్రం వివరించాడు సి.ఐ. ఇటు పైని రాజేశ్వర్రావు పక్కన మహాత్మాగాంధి లాంటి మనిషి నిల బడ్డా అతగాణ్ని ఖూనీకోరుగానూ, కాపుసారా చేసేవాడుగాను, చూస్తానని ప్రామిస్ చేస్తున్నట్టు.

ఆనాటినుంచి మరి సిక్స్ సెన్స్ గురించి రాజేశ్వర్రావు మాట్లాళ్లేదు.

**(జ్యోతి, దీపావళి 10.11.1988)**